క్లుప్తంగా

రోడ్డు వెంబడి ఆక్రమణలు తొలగింపు



నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ 11వ లైన్ న్యూ గుంటూరు రైల్వే స్టేషన్‌లో రోడ్డులో ఆక్రమించుకుని నివాసం ఉంటున్న వారిని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించారు. గత 40 ఏళ్ల తరబడి సదరు ప్రాంతంలో నివాసం ఉంటున్న వారి వెనుక స్థలంలో స్థల యాజమానులు ఇల్లు నిర్మించుకునేందుకుగాను స్థలం ముందు అడ్డుగా ఉన్న ఆక్రమణలు తొలగించాలని హై కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు స్థలానికి ముందు ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఉత్తర్వులు ఇవ్వడంతో మంగళవారం పట్టణ ప్రణాళిక డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య ఆధ్వర్యంలో పోలీసు, ఫైర్ సిబ్బంది, మెడికల్ సిబ్బందితో కలసి రోడ్డుపై ఆక్రమించుకుని నివాసం ఉంటున్న నాలుగు ఇళ్లను కూల్చివేశారు.

రజకులపై దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

నెహ్రూనగర్: యడ్లపాడు మండలం ఉన్నవలో రజకుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావుని సంఘ నాయకులు పరామర్శించారు. బర్రె కొమ్ము తగిలిందని అగ్రవర్ణాలకి చెందిన వారు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సింగిల్ నంబరు లాటరీ కేసులో ఇద్దరి అరెస్ట్

గుంటూరు ఈస్ట్: సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న ఇద్దరిపై అరండల్‌పేట కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. డొంకరోడ్డులో సింగిల్ నంబరు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం దాడి చేశారు. మల్లిబోయిన శ్రీను, ఊటుకూరి ఏసుబాబులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరి నుంచి రూ.2 వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల తనిఖీలు

పట్నంబజారు: పట్టణంలో మంగళవారం రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశారు. మొత్తం 15 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గుంటూరులోని జేకేసీ కాలేజీ రోడ్డు, చుట్టుగుంట, గుజ్జనగుండ్ల తదితర ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగాయి.

డెలివరీ బోయ్‌లపై కేసు

గుంటూరు ఈస్ట్ :డెలివరీ బోయ్‌లు సంస్థను మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చుట్టుగుంట సమీపంలో షాడో ఫ్యాక్స్ పేరుతో ఫిల్ప్‌కార్ట్ డెలివరి సంస్థ నిర్వహిస్తున్నారు. డెలివరీ బోయ్‌లుగా పని చేసే మనోజ్‌రెడ్డి, విజయ ఆనందరాజు కస్టమర్లు రిటన్ చేసిన వస్తువులను సంస్థకు అప్పగించకుండా వాటి స్థానంలో రాళ్లు, సబ్బులు పెట్టి ప్యాక్ చేసి సంస్థకు అప్పగించేవారు. సుమారు 500 వస్తువులను ఆ విధంగా మోసపూరితంగా రిటన్ చేశారు. వాటి విలువ రూ.5 లక్షలు ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. సంస్థ ప్రతినిధి రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోరు పనులు ప్రారంభం

గుంటూరు రూరల్: శివారు గ్రామాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని అంకిరెడ్డిపాలెంలో రూ.9లక్షలతో ఏర్పాటు చేయనున్న తాగునీటి బోర్లకు పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల, మున్సిపాల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

కౌలు కార్డులు త్వరితగతిన అందించాలి



గుంటూరు రూరల్: కౌలు రైతులను గుర్తించి, వెంటనే కౌలు కార్డులను అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం పొత్తూరు గ్రామంలో పత్తి, ఆకుకూరలు తదితర పంటలను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట వివరాలను నమోదు చేసి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులను త్వరితగతిన రైతులకు అందించాలని చెప్పారు. అనంతరం రైతులతో మాట్లాడారు. పంటల సాగు విస్తీర్ణం, పంట వివరాలు తెలుసుకున్నారు. యాజమాన్య పద్ధతులు వివరించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.సుబ్రమణ్యం, పొత్తూరు వీఆర్‌వో రవి, వీఏఏ వైష్ణవి పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పాత గుంటూరు: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్, స్పెషల్ సమ్మరి రివిజన్- 2024 పై ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయించబడిన సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని కోరారు. ప్రతి ఏడాది కేంద్ర ఎన్నికల సంఘం సమ్మరి రివిజన్ చేపడుతుందని, అందులో భాగంగా ఈ నెల 21 నుంచి ఆగస్ట్ 21 వరకు జిల్లాలో కూడా స్పెషల్ క్యాంపెయిన్ జరుగుతుందని తెలిపారు. స్పెషల్ క్యాంప్‌లో భాగంగా బీఎల్‌ఓ లు ప్రతి ఇంటి వద్దకు వెళ్ళి పరిశీలించి ఓటర్లకు సంబంధించి సమగ్ర రిపోర్ట్ సేకరించాలని ఆదేశించారు. తొలుత బీఎల్‌ఓలు తమకు కేటాయించిన ప్రాంతంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. క్యాంపెయిన్‌లో భాగంగా బీఎల్‌ఓలు ప్రధానంగా ఇంటి డోర్ నంబర్, ఓటర్ పేరు, వయసు, లింగం, వలసలు వెళ్లిన వారి వివరాలు, చనిపోయిన వారి వివరాలు తగిన ఫారంలో నమోదు చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండి ఓటు అర్హత ఉన్న వారికి నూతన ఓటు దరఖాస్తులు చేయాలని, బీఎల్‌ఓలు ప్రత్యేక రిజిస్టర్ మెయింటింగ్ చేయాలని చెప్పారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ స్పెషల్ క్యాంపెయిన్‌లో బీఎల్‌ఓల పాత్ర అత్యంత కీలకమని, ఓటు తొలగింపు, చేర్పులని నిర్దేశిత ఫారాల ద్వారానే దరఖాస్తు చేయాలన్నారు. ప్లానింగ్ కార్యదర్శులు నూతన్ గెజిట్ ప్రకారం ఓటర్లు ఉన్న ప్రతి ఇంటికి డోర్ నంబర్ పరిశీలించాలని కోరారు. డోర్ నంబర్ సరిగా లేని వాటికి గెజిట్ మేరకు నంబర్లు కేటాయింపు చేపట్టే పనిని పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేక కార్యాచరణ మేరకు పర్యవేక్షించాలని తెలిపారు. నగర ప్రజలు కూడా తమ ఇళ్ల వద్దకు వచ్చే బీఎల్‌ఓలకు ఓట్లకు సంబంధించిన సమగ్ర వివరాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ చంద్రశేఖరావు, అదనపు కమిషనర్ పెద్ది రోజా, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, గుంటూరు తూర్పు, పశ్చిమ తహసీల్దార్లు నగేష్, సాంబశివరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలి

సూపరింటిండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



జీజీహెచ్ శుభ్రం చేస్తున్న డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లోని మరుగుదొడ్లను సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఆస్పత్రి ఓపీకి వచ్చే రోగులకు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్న విషయాన్ని గమనించి ఓపీలో ఉన్న మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లను పరిశీలించారు. మరుగుదొడ్ల తలుపులకు తాళం వేసి ఉండటాన్ని గమనించారు. తాళాలు వేసి ఉన్న మరుగుదొడ్లలో చెత్తచెదారం పేరుకు పోయి ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేసి తక్షణమే వాటిని వినియోగంలోకి తీసుకొచ్చి రోగులకు అందించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం జీజీహెచ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిధులు ఖర్చు పెడుతుంటే శానిటేషన్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యంపై సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్లు ఉన్నారు.

పనికిరాని వస్తువులను వర్క్ షాపునకు తరలించండి

గుంటూరు జీజీహెచ్‌లో వివిధ ఓపీ విభాగాల్లో నిరూపయోగంగా ఉన్న వస్తువులను వెంటనే వర్క్ షాపునకు తరలించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆసుపత్రిలోని ఓపీ విభాగాలను తనిఖీ చేశారు. కాన్పుల విభాగంలో ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ రూమ్, కలర్ డాప్లర్ స్కాన్ గదులను పరిశీలించారు. నిరూపయోగంగా ఉన్న ట్రైసైకిళ్లు ఎందుకు ఉంచారంటు సిబ్బందిని ప్రశ్నించారు. ఇలాంటి వస్తువులను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

ప్రభుత్వం వెన్నుదన్ను

గుంటూరు జీజీహెచ్‌కు వచ్చిన ప్రతి గర్భిణిసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తల్లితో పాటు పుట్టబోయే బిడ్డకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా లబ్ది అందిస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం గైనకాలజీ విభాగంలో జనని సురక్ష యోజన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వైద్యులు, వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ జనాభాలో ప్రపంచంలో మొదటి స్థానం భారతదేశం ఆక్రమించిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు జనాభా పెరిగిపోతుందని, తద్వారా తలెత్తే ఆరోగ్య సమస్యలు, సామజిక దుష్పరిణామాలను వివరించేందుకు సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాతంత్ర్య అమృత్ మహోత్సవం సందర్భంగా కుటుంబ సంతోషం, శ్రేయస్సు కోసం కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటిద్దాం అని ప్రతిజ్ఞ చేద్దాం అనే నినాదం ప్రకటించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ నూతన కార్యవర్గం



ఎన్నికైన రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ నూతన కార్యవర్గం

పాత గుంటూరు: రింగ్‌రోడ్డులోని హోటల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. క్లబ్ నూతన ప్రెసిడెంట్‌గా కొమ్మాలపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ సీతారామాంజనేయులు, కార్యదర్శిగా మండవ రాజగోపాల్, కోశాధికారిగా వాసిరెడ్డి స్రవంతి, డైరెక్టర్లుగా ఏటుకూరి రత్న, మలినేని పెరుమాళ్, సరిపుడి అనిల్, కందిమళ్ల స్వప్న, పెరవలి నాగ వంశీ, వంకాయలపాటి సురేష్, మౌర్య సుబ్రహ్మణ్యం, డాక్టర్ రాకేష్, ఏడుకొండలు, వీరయ్య, డాక్టర్ రాఘవ, అభయ, గౌరీశంకర్, ప్రభాకర్ ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకార సభలో ముఖ్య అతిథులుగా రోటరీ గవర్నర్ బూసి రెడ్డి శంకర్‌రెడ్డి, అన్నే రత్నప్రభాకర్, ముప్పాళ్ల సుబ్బారావు, మద్దినేని సుధాకర్ పాల్గొని నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు.

సంక్షేమంతో సురక్షిత పాలన అందిస్తున్న జగనన్న

- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు
- అడవితక్కెళ్ళపాడులో జగనన్న సురక్ష కార్యక్రమం



సర్టిఫికెట్ అందజేస్తున్న మేయర్ కావటి మనోహర్‌నాయుడు

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రజలకు సంక్షేమంతో పాటు సురక్షితమైన పాలనను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని గుంటూరు నగర కార్పొరేషన్ మేయర్ కావటి మనోహర్ నాయుడు అన్నారు. మంగళవారం 41వ డివిజన్ అడవితక్కెళ్లపాడులో స్థానిక కార్పొరేటర్ బి.స్మితపద్మజ అధ్యక్షతన నిర్వహించనున్న జగనన్న సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేయర్ కావటి మాట్లాడుతూ మనబడి నాడు - నేడు ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్ వైద్య రంగంలో ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి ఒక్కరికి ఆరోగ్య భద్రత కల్పించారన్నారు. స్వర్ణభారతి నగర్, అడవితక్కెళ్ళపాడు, రెడ్డిపాలెం సచివాలయాల పరిధిలోని అర్జీలు పెట్టుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, వెస్ట్ తహసీల్దారు సాంబశివరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముత్యాల రాజు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) తెలిపారు. మంగళవారం లాలుపురం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందాలని నవరత్నాల పథకాలను ప్రజల ఇంటి ముంగిటకు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనన్నారు. ఏ సమస్య వచ్చినా అధికారుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామంలోనే అన్ని శాఖల అధికారులను ఏర్పాటు చేసి క్షణాల్లో సమస్యల పరిష్కారం చూపుతున్నారన్నారు. అర్జీదారులకు సర్టిఫికెట్లు, కౌలు రైతు కార్డులు, సబ్సిడీ విత్తనాలు అందజేశారు. రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీడీవో శోభరాణి, డిప్యూటీ తహసీల్దారు బిట్టు రమేష్, జేసీఎస్ మండల కన్వీనర్ ఎదురుపాక వెంకట్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ, ఏవో ఐ.సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



గుంటూరు మెడికల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానం చేసి ప్రాణదాతలుగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని క్యాపిటల్ హోటల్ జనరల్ మేనేజర్ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్టీఆర్ ట్రస్ట్ సౌజన్యంతో విజేత సూపర్ మార్కెట్, కాపిటల్ హోటల్ సంయుక్తంగా రక్తదాన శిబిరం హోటల్‌లో నిర్వహించారు. రక్తదాతలకు కాపిటల్ హోటల్ జనరల్ మేనేజర్ శ్రీధర్ సర్టిఫికెట్స్ అందజేసి రక్తదాతలను అభినందించారు.

ఎంబీఏ విద్యార్థులకు సదస్సు



గుంటూరు ఎడ్యుకేషన్: కార్మికులు, యజమానుల నడుమ సహృద్భావ వాతావరణం ఉండాలని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం పారిశ్రామికాభివృద్ధిలో కార్మికుల పాత్ర అనే అంశంపై ఎంబీఏ విద్యార్థులకు అతిథి ఉపన్యాసమిచ్చారు. ఎస్వీ రమణ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా వస్తాయని, తద్వారా అధిక ఉత్పత్తి సాధించవచ్చునని చెప్పారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సాంకేతికత ఆవిర్భావంతో కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని అన్నారు. ఎంబీఏ హెచ్‌ఆర్ విద్యార్థుల పాఠ్యాంశాల్లో ఈ విషయం గురించి ప్రత్యేకంగా ప్రస్తావని చేయబడినట్లు తెలిపారు. ఔషధ పరిశ్రమలో విశిష్టమైన అనుభవం కలిగి, పరిశ్రమల మనుగడకు కార్మిక సంఘాల దృక్పధంపై పరిశోధన చేసిన డాక్టర్ కాకాని పృద్వీరాజ్ తన పరిశోధన గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, సహాయాచార్యులు బి.కల్యాణి, సీహెచ్ వైష్ణవి, బి.అనిత, ఏ బాజీబాబు, ఎస్.మణికంఠ, వి.అభిలాష్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధి వైఎస్సార్ సీపీ తోనే సాధ్యం

పెదకాకాని: ఆలయాల అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందని శివాలయం ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అన్నారు. ఉప్పలపాడులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు మాట్లాడుతూ నూతనంగా శివాలయం ధర్మకర్తల మండలి ఏర్పాటు కావడాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ బురదజల్లే ఆరోపణలు చేయడం మంచిదికాదన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం దేవాలయ చైర్మన్ నియామకంలో రాజకీయాలు చేయడం వారి చేతగానితనానికి నిదర్శనమన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు గజ్జల వెంకాయమ్మ, తోట రవీంద్ర, గంగవరపు మల్లేశ్వరరావు, గుమ్మళ్ళ వెంకట్రావు, కారంకి శివనాగేశ్వరమ్మ, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, తోటకూర వెంకటేశ్వరరావు, కరణం సాంబశివరావు, కానుగోలు శంకరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ శివాబత్తుని దయానంద్, ముద్రవరపు నాగేశ్వరరావు, మైలా సుబ్బారావు, చెన్నుపాటి కళ్యాణ్, పల్లెంపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి మహాత్మాగాంధీ సంపుటాల అందజేత



సంపుటాలను అందించిన మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య గ్రంథాలయాన్ని మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి మహాత్మా గాంధీ సమగ్ర రచనల సంపుటాలను బహుమతిగా ఇచ్చారు. గ్రంథాలయ నిర్వాహకులు లంకా సూర్యనారాయణ, లైబ్రేరియన్ నలజాల సుభాషిణి, తిప్పారెడ్డి రామకృష్ణారెడ్డి, భిక్కు నాయక్, పాలకాయల వెంకట్ పాల్గొన్నారు.

అత్యున్నత స్థాయిలో గ్రామ సచివాలయాల సేవలు

క్రికెటర్ అంబటి రాయుడు



మాట్లాడుతున్న క్రీడాకారుడు అంబటి రాయుడు

లక్ష్మీపురం: గ్రామ సచివాలయాలు, వార్డు వలంటీర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలన చేయడం అభినందనీయమని క్రీడాకారుడు అంబటి రాయుడు అన్నారు. స్థానిక పొన్నూరు రోడ్డులోని అంజుమన్ ఉర్దూ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంచి ఆలోచనతో ప్రజలకు మంచి జరగాలని, ప్రభుత్వ కార్యకలాపాలు ప్రజల ముంగిట ఉండేలా సచివాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సచివాలయాల్లో అడ్మిన్‌లు, వార్డు వలంటీర్లు ప్రజలకు నిరంతరం తమదైన శైలిలో స్వచ్ఛంద సేవ చేస్తుంటే మరోవైపు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డు వలంటీర్లు, సచివాలయాల వల్ల యువతతో పాటు, రైతులు, వృద్ధులకు రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు సకాలంలో అందుతున్నాయని చెప్పారు. ప్రధానంగా కరోనా సమయంలో కూడా రాష్ట్రం మొత్తం అంధకారంగా మారుతున్న సమయంలో కూడా వలంటీర్లు భయపడకుండా ప్రజలకు సేవ చేయడం జరిగిందని గుర్తు చేశారు.

విద్యార్థులతో..

ఉర్దూ పాఠశాలలో విద్యార్థులతో అంబటి రాయుడు మాట్లాడుతూ అంజుమన్ కమిటీ జిల్లాలోనే అత్యున్నత విద్యార్థులకు అన్ని విధాలా సదుపాయాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అంబటి రాయుడు అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలో కూడా రాణించాలన్నారు. తాను ఎనిమిదో ఏటా నుంచి క్రికెట్ ఆడడం ప్రారంభించానని, దేశానికి మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడల్లో పాల్గొన్నట్లు వెల్లడించారు. అనంతరం ఉర్దూ పాఠశాలకు కావాల్సిన సదుపాయాలు, క్రీడా సామగ్రిని త్వరలో అందజేస్తానని, క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులకు తన వంత సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. విద్యార్థులందరూ ఆటోగ్రాఫర్ తీసుకున్నారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా, నగర మేయర్ కావటి



లబ్ధిదారుకి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి, కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ విప్లవాన్ని తెచ్చారని, అర్హులైన ఏ ఒక్కరికి ప్రభుత్వ పథకం అందలేదని ఫిర్యాదు రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. ఆనందపేట 9వ లైన్ మెయిన్‌రోడ్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి నగర కమిషనర్ కీర్తి చేకూరి హాజరయ్యారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ఇంటి ముందుకే చేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఇంటి ముందుకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతం కులమతాలకు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి ప్రజా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మేయర్ కావటి మాట్లాడుతూ 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందేలా వార్డు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారన్నారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సేవలు అందేలా చేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమన్నారు. నెలరోజుల పాటు ప్రతి గడపకు వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు వెళ్ళేలా కార్యాచరణ రూపొందించారని పేర్కొన్నారు. సదరు కార్యక్రమంలో భాగంగా గత వారం రోజుల నుంచి 11 వ వార్డులో వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివిధ పథకాలకు లబ్ధిదారుల అర్హుల వివరాలు, అవసరమైన ధ్రువపత్రాల అర్జీలను సేకరించారన్నారు. డివిజన్ పరిధిలో వివిధ అంశాలకు సంబంధించి అర్జీలు, దరఖాస్తులు అందగా వాటిని పరిశీలించి ఆమోదం తెలిపి సర్టిఫికెట్స్ అందిస్తున్నామని వివరించారు. జగనన్న సురక్ష క్యాంప్‌లు మంగళవారం ఆనందపేట, ఆర్టీసీ కాలనీ, పాత గుంటూరు, నగరంపాలెం, చుట్టగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానం, అడవితక్కెళ్లపాడు కమ్యూనిటీ హాల్, 6 ప్రాంతాల్లో 22 సచివాలయాల పరిధిలో వివిధ రకాల సేవలకు సంబంధించి అందిన 3,425 దరఖాస్తులను పరిశీలించి, నిర్దేశిత పత్రాలు ఉన్న వారికి సర్టిఫికెట్స్ అందించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ ఆబిద్ బాషా, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, గుంటూరు తూర్పు తహసీల్దార్ నగేష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, నూరి ఫాతిమా పాల్గొన్నారు.

నిబంధనల మేరకే నిర్మాణాలు చేపట్టాలి

కమిషనర్ కీర్తి చేకూరి



భవనాలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగానే చేపట్టాలని, నిబంధనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయబోమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఏటీ అగ్రహారం, బృందావన్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో ఆక్యుపెన్సి సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను మంగళవారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎల్‌టీపీలు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్ లైన్ ద్వారా డి.పి.ఎం.ఎస్.లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయనున్నట్లు హెచ్చరించారు. మాస్టర్ ప్లాన్ ఎలైన్మెంట్ కాని, లేదా మాస్టర్ ప్లాన్‌లో చేసిన భవన నిర్మాణాలకు ఆక్యుపెన్సీ అనుమతులు ఇవ్వబడవన్నారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరికి కేటాయింపు ఉండాలని కోరారు. రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్‌లు నామమాత్రం కాకుండా పక్కాగా పని చేసేలా కనెక్షన్ చేయాలని వివరించారు. ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని కోరారు. ప్లానింగ్ కార్యదర్శులు తప్పనిసరిగా భవన నిర్మాణ అనుమతులు, ప్రణాళిక విభాగానికి సంబంధించిన నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, టీపీఎస్ లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

మేయర్ కావటి



పాఠశాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దినట్లు నగర మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు అన్నారు. గుంటూరు నగరంలోని ఆర్.అగ్రహారంలోని కావటి శంకరరావు మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో రూ.1.39 కోట్లతో మన బడి- నాడు నేడు పథకం కింద నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని తనిఖీ చేశారు. మేయర్ మాట్లాడుతూ నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల జ్యోతి పద్మజ, నగర పాలక సంస్థ స్కూల్ సూపర్ వైజర్ శేషగిరి రావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస రెడ్డి, డీఈఈ రమేష్ బాబు పాల్గొన్నారు.